


నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యా కళావేదికపై సోమవారం సిద్దిపేటకు చెందిన భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



పెద్దమ్మ జాతరకు వేళాయె!

యాళ్లూరులో పెద్దమ్మ జాతరను నిర్వహించేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. పదకొండేళ్ల తర్వాత నిర్వహిస్తున్న జాతర నేటి నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. 8లో▸




నలుగురిపై హత్య కేసు నమోదు

కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీనారాయణ హత్యోదంతంలో నలుగురిపై కేసు నమోదైంది. హత్య జరిగిన ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. 8లో▸

తమ్ముళ్లు 'ఎగరేసుకుపోయారు'!

టీడీపీ కార్యకర్తలకే డ్రోన్లు

- ఉమ్మడి జిల్లాకు 80 మంజూరు
- గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే అందుబాటులోకి సేవలు
- అప్పట్లో మహిళా సంఘాలకు ఉచితంగా 8 సరఫరా
- శిక్షణ ధ్రువపత్రాలు ఇచ్చిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
- కూటమి ప్రభుత్వం అప్పటి గ్రూపులను పక్కన పెట్టిన వైనం
- టీడీపీ కార్యకర్తలతో ఎఫ్ఎంజీ కిసాన్ డ్రోన్ గ్రూపుల ఏర్పాటు



కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునేందుకు సాంకేతికత దోహదపడుతోంది. ఇందులో భాగంగానే వైఎస్సార్సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల వారీగా(ఆర్ఎస్కేలు) వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద కస్టమ్ హయరింగ్ సెంటర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు అందుబాటులోకి తెచ్చింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సులభంగా, వేగంగా పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్లను కూడా వినియోగంలోకి తీసుకొచ్చింది. నాటి ప్రభుత్వ చొరవతో వివిధ ఎరువుల కంపెనీలు 8 డ్రోన్లు మహిళా గ్రూపులకు సరఫరా చేశాయి. ఐదు కోరమాండల్ కంపెనీ, ఇఫ్కో, పీపీఎల్, ఆర్సీఎఫ్ కంపెనీలు ఒక్కొక్కటి చొప్పున అందించాయి. డ్రోన్ల వినియోగానికి ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసి పైలెట్ శిక్షణ కూడా ఇప్పించారు. 2023–24లోనే ఈ గ్రూపులకు సబ్సిడీపై డ్రోన్లు ఇవ్వాలని తలపెట్టినప్పటికీ ఎన్నికల కోడ్ రావడం వల్ల సాధ్యం కాలేదు. కూటమి ప్రభుత్వం కూడా డ్రోన్ సేవలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. అయితే టీడీపీ కార్యకర్తలకే డ్రోన్లను మంజూరు చేస్తుండటం గమనార్హం. 2023–24లో రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారితో ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసి ఇవ్వాలని తలపెట్టింది. కూటమి ప్రభుత్వం కూడా మొదట్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పైలెట్ శిక్షణ పొందిన వారిలో ఆసక్తి ఉన్న గ్రూపులకు డ్రోన్లు ఇవ్వాలని తలపెట్టింది. అయితే ఆ ప్రభుత్వంలో ఎంపిక చేసిన వారికి ఇవ్వడం తగదని కూటమి పార్టీల నేతలు ఒత్తిడి తెచ్చి టీడీపీ కార్యకర్తలకే మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టడం గమనార్హం. టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్చార్జీలు రెకమెండ్ చేసిన కార్యకర్తలకే డ్రోన్లు అంటూ ప్రచారం జోరుగా జరుగుతోంది.

నాడు శిక్షణ సర్టిఫికెట్లు పొందినా..

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో కర్నూలు జిల్లాలో 36 మంది, నంద్యాల జిల్లాలో 35 మంది రిమోట్ పైలెట్ శిక్షణ పొందారు. వీరిలో అగ్రికల్చర్ బీఎస్సీ, అగ్రికల్చర్ డిప్లొమో చేసిన వారు కూడా ఉన్నారు. గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీరు 12 రోజుల శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు అందుకున్నారు. 2024 జూన్ నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో డ్రోన్ అందుబాటులోకి రావడం ఆలస్యమైంది. ఆ తర్వాత కూడా ఏడాది జాప్యం చేశారు. ఎట్టకేలకు 2025–26లో డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే వైఎస్సార్సీపీ పాలనలో ఎంపిక చేసిన గ్రూపులను, రిమోట్ పైలెట్లను పక్కన పెట్టడం విమర్శలకు తావిస్తోంది. కొందరు వ్యవసాయ అధికారులే సంబంధిత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జీలతో మాట్లాడుకోవాలని సూచిస్తుండటం గమనార్హం. టీడీపీ మద్దతుదారులు, సానుభూతి పరులనే ఎంపిక చేస్తుండటంతో తమ పరిస్థితి ఏమిటని శిక్షణ పొందిన వారు ప్రశ్నిస్తున్నారు.

సర్టిఫికెట్లు ఏం చేసుకోవాలి



అగ్రికల్చర్ డిప్లొమా పూర్తయింది. 2024 జనవరి 5 నుంచి 16వ తేదీ వరకు డ్రోన్ రిమోట్ పైలెట్గా శిక్షణ తీసుకున్నా. ఇలాగైనా ఉపాధి లభిస్తుందని ఆశపడ్డా. ప్రభుత్వం మారడంతో మమ్మల్ని పక్కనపెట్టేశారు. శిక్షణ పొందిన సర్టిఫికెట్లు ఏం చేసుకోవాలి. నిరుద్యోగుల విషయంలోనూ రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసం. – ముత్యాలరాజు, వెల్దుర్తి గ్రామం

ఏజీబీఎస్సీ చేసిన యువకుడినీ పక్కనపెట్టారు

కల్లూరు మండలం పుసులూరు గ్రామానికి చెందిన యువకుడు అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశాడు. వ్యవసాయం పట్ల అతనికున్న ఆసక్తిని గమనించి గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో డ్రోన్ పైలెట్గా ఎంపిక చేశారు. రైతులకు సేవ చేసేందుకు అవకాశం కలిసి వచ్చిందని అతను ఎంతో సంతోషించాడు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులు రిమోట్ పైలెట్ శిక్షణ కూడా తీసుకున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు 'తమ్ముళ్ల' కోసం ఇతడిని పక్కన పెట్టేయడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాకు 80 డ్రోన్లు మంజూరు

- కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాకు 80 డ్రోన్లను మంజూరు చేసింది.
- కర్నూలు జిల్లాకు 40, నంద్యాల జిల్లాకు 40 ప్రకారం కేటాయించారు.
- టీడీపీ కార్యకర్తలతో ఏర్పాటైన ఎఫ్ఎంబీ కిసాన్ డ్రోన్ గ్రూపులకు మంజూరు చేస్తోంది.
- వీటి సరఫరాకు డ్రోగో, విహంగ కంపెనీలను ఎంపిక చేసింది.
- డ్రోగో కంపెనీ డ్రోన్ పూర్తి ధర రూ.9.80 లక్షలు, విహంగ కంపెనీ డ్రోన్ ధర రూ.9.81 లక్షలు.
- ఇందులో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇస్తుంది.
- అయితే 50 శాతం మొత్తానికి బ్యాంకులు రుణాలు ఇస్తాయి. మిగిలిన 50 శాతం కిసాన్ డ్రోన్ గ్రూపులు భరిస్తాయి.
- ఎఫ్ఎంబీ కిసాన్ డ్రోన్ గ్రూపులో ఐదుగురు సభ్యులు ఉంటారు.
- గ్రూపు సభ్యులు పైలెట్గా ఎంపిక చేసుకున్న వారికి ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది.
- ఈ పైలెట్ కనీసం మూడేళ్లు పనిచేయాల్సి ఉంది.
- మధ్యలో మానుకోవాలనుకుంటే రూ.70 వేలు చెల్లించాలనే నిబంధన పెట్టారు.
- డ్రోన్ల సామర్థ్యం 25 లీటర్లు.

నంద్యాల జిల్లాలో వైఎస్సార్సీపీ ముద్ర వేసి..

కర్నూలు జిల్లాలో వైఎస్సార్సీపీ హయాంలో రిమోట్ పైలెట్గా శిక్షణ పొందిన వారిలో కూటమి ప్రభుత్వంలో కూడా కొందరికి అవకాశం ఇచ్చారు. శిక్షణ పొందిన వారు సంబంధిత ఎమ్మెల్యేలను కలువడంతో ఇది సాధ్యమైంది. జిల్లాలో 36 మంది పైలెట్ శిక్షణ పొందితే 10 మందికి పైగా అవకాశం దక్కించుకున్నారు. నంద్యాల జిల్లాలో మాత్రం గత ప్రభుత్వంలో శిక్షణ పొందిన వారందరినీ వైఎస్సార్సీపీ ముద్ర వేసి పక్కన పెట్టడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అర్హతలను పక్కన పెట్టి కార్యకర్తలకే పెద్దపీట వేసింది. అర్హతలను పట్టించుకోకుండా పైలెట్ శిక్షణకు పంపుతుండటం మితిమీరిన రాజకీయానికి నిదర్శనం.

గాలివానకు రాలిన ఆశలు

- వరి, అరటి, మామిడి రైతులు కుదేలు

నంద్యాల(అర్బన్): అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలతో వరితో పాటు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలు, పెనుగాలులకు వరి, మొక్కజొన్న, కొర్ర, మినుము పంటలు 1,321 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన గాలి, వాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో కురిసిన వర్షాలకు అరటి, వరిపైర్లు నేలకొరిగాయి. ఈదురుగాలుల దాటికి పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారుల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారాయి. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు 1,321 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అందులో వరి 1,057 వరి హెక్టార్లు, 2,18 హెక్టార్లు మొక్కజొన్న, మరికొన్ని పంటలు దెబ్బతిన్నట్లు అంచనాలు తయారు చేసి నివేదికలను రాష్ట్రస్థాయి అధికారులకు పంపారు. బండిఆత్మకూరు మండలంలో 402 హెక్టార్లు, మహానందిలో 325, నంద్యాలలో 15, ఆళ్లగడ్డలో 81, అవుకులో 308, చాగలమర్రి మండలంలో 190 హెక్టార్ల పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు.

ఉద్యాన పంటలకు నష్టం

గత నాలుగు రోజులుగా జిల్లాలో అక్కడక్కడ కురుస్తున్న అకాల వర్షాలకు ఉద్యానవన పంటలకు భారీగా నష్టం జరిగింది. మహానంది, కొలిమిగుండ్ల, బండిఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, తదితర మండలాల్లో అరటి చెట్లు నేలకొరిగి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అదే విధంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.



అవుకులో ఈదురు గాలులతో కూడిన వర్షం

జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు..

జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మొత్తం మీద 139 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. అందులో కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 48.0 మి.మీ పగిడ్యాలలో అత్యల్పంగా 0.8 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా బనగానపల్లెలో 23.2, అవుకులో 22.4, ప్యాపిలిలో 16.4, బేతంచెర్లలో 8.2, డోన్ 4.2, మిడుతూరు 3.4, నందికొట్కూరు 3.2, కోవెలకుంట్ల 2.4, గోస్పాడు 2.2, జూపాడుబంగ్లా, పాణ్యం, సంజామల 1.2, ఉయ్యాలవాడ 1.0 మి.మీ వర్షం కురిసింది.



మదనంతపురంలో నేలవాలిన అరటిచెట్లు

అరటి రైతులకు అపారనష్టం

కొలిమిగుండ్ల: ఈదురుగాలల బీభత్సంతో అరటి రైతులకు అపార నష్టం వాటిల్లింది. అరటి గెలలు కోత కోసే సమయంలో బలమైన గాలులు వీయడంతో గెలలతో సహ చెట్లు నేలకొరిగాయి. మదనంతపురం, కోర్నపల్లె తదితర గ్రామాల్లో రైతులు వంద ఎకరాలకు పైగానే అరటి సాగు చేశారు. రెండు మూడు రోజుల్లో కోత కోసేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో అకాల వర్షం రూపంలో నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పది రోజుల ముందుగానే చాలా మంది రైతులు అరటి గెలలను కోసుకున్నారు. మొక్క జొన్న ఆరబెట్టుకోవడంతో వర్షం దాటికి తడిసిపోయాయి. మిరప రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అత్యధికంగా కొలిమిగుండ్ల మండలంలో 48 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఉచిత విద్య ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈఓ శామ్యూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాల్సి ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఉచిత విద్యను అందించే జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గడువులోపు తమ వివ రాలను విద్యాశాఖ వెబ్సైట్ https://cse.ap.gov.inలో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు మే నెల 2 నుంచి 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్సీ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఐదేళ్ల వయస్సు, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు జూన్ 1వ తేదీ నాటికి ఐదేళ్ల వయస్సు నిండిన పిల్లలు దరఖాస్తుకు అర్హులన్నారు. వచ్చే నెల 20 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థుల ప్రవేశాలకు అర్హతల ఆధారంగా లాట రీ తీస్తామన్నారు. 29న ఫలితాలను విడుదల చేసి, జూన్ 8న ప్రవేశాల నిర్ధారణ చేస్తారని, రెండో విడత 11న సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేసి, 18న ప్రవేశాల నిర్ధారణ చేస్తామన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్వో రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన 32,796 వినతుల్లో 30,985 పరిష్కారమయ్యాయన్నారు. రీఓపెన్ అయిన 59పై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న 1,811 వినతులకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిష్కార స్థితిపై కొత్త ట్యాగ్ విధానాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు.

'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

వచ్చే 4వ తేదీన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) యూజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హై స్కూల్, టెక్కె జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు 1,172 మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లో అనుమతి ఇస్తారని నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ వెంకటరమణను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి వసతి కల్పించాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన బెంచీలు ఏర్పాటు చేయాలని డీఈఓను సూచించారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మల్లన్న 'స్పర్శ' భాగ్యం .. సామాన్యులకు దూరం

- గతంలో నాలుగు రోజుల పాటు ఉచితంగా స్పర్శదర్శనం
- కొన్ని నెలలుగా ఉచిత స్పర్శదర్శనం నిలిపివేసిన దేవస్థానం
- పునరుద్ధరించాలని కోరుతున్న భక్తులు



శ్రీశైల ఆలయం



మల్లన్న ఉచిత స్పర్శ దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీశైల క్షేత్రంలో మాత్రమే జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారికి తలను తాకించి స్పర్శదర్శనం చేసుకునే భాగ్యం ఉంది. ప్రతి ఒక్క భక్తుడు స్వామివారిని స్పర్శ దర్శనం చేసుకునేందుకు ఆరాటపడతారు. అయితే స్పర్శ దర్శనం టిక్కెటు రుసుం రూ.500గా దేవస్థానం నిర్ణయించింది. స్పర్శదర్శనం టికెట్లు పూర్తిగా ఆన్లైన్లో తీసుకోవాలి. మల్లన్న దర్శనానికి వచ్చే పేద, సామాన్య భక్తులకు ఆర్థిక భారంతో పాటు అవగాహన లేకపోవడంతో స్పర్శ దర్శనానికి నోచుకోలేక పోతున్నారు. పేదలను దృష్టిలో ఉంచుకుని గతంలో దేవస్థానం వారంలో నాలుగు రోజుల పాటు ఉచిత స్పర్శ దర్శన భాగ్యం కల్పించింది. భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి శని, ఆది, సోమవారాల్లో అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ రద్దీ రోజులు కాకుండా ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు రెండు పూటలా మల్లన్న స్పర్శదర్శనానికి సమయాన్ని కేటాయించారు. ఈమేరకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30గంటల వరకు అవకాశం కల్పిస్తూ 2022 కార్తీక మాసం నుంచి ప్రారంభించారు. అనంతరం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని అప్పటి దేవస్థాన కార్యనిర్వహణాధికారి మంగళవారం నుంచి సాయంత్రం వేళలలో కూడా 6.30 నుంచి 7.30 గంటల వరకు ఒక గంట పాటు సామాన్య భక్తులకు మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పించారు. ఆ తర్వాత ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండు గంటల పాటు భక్తులకు ఉచితంగా మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పించారు. భక్తులు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి క్యూలైన్లలో ఉన్నవారికి ఈ అవకాశం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మల్లన్నను ఉచితంగా స్పర్శదర్శనం చేసుకుని తరించేవారు.

ఉచిత స్పర్శదర్శనానికి మంగళం..

గత కొన్ని నెలల నుంచి మల్లన్న ఉచిత స్పర్శదర్శనానికి దేవస్థాన అధికారులు మంగళం పలికారు. భక్తుల రద్దీ పేరుతో ఉచిత మల్లన్న స్పర్శదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే సామాన్య భక్తులు, డబ్బులు పెట్టి ఆన్లైన్లో టికెట్లు పొందే స్థోమత లేని పేద భక్తులు నిరాశతో దూర దర్శనం చేసుకుని వెళ్తున్నారు. ఇప్పటికైన దేవస్థాన అధికారులు స్పందించి మల్లన్న ఉచిత స్పర్శదర్శనాన్ని కొనసాగించాలని, గతంలో మాదిరి ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఈ దర్శన సౌకర్యం కల్పించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

కమిషనర్తో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

శ్రీశైల దేవస్థానంలో గతంలో సామాన్య భక్తుల సౌకర్యార్థం మల్లికార్జునస్వామివారి ఉచిత స్పర్శదర్శనం కల్పించారు. కాలక్రమేణా క్షేత్రానికి భక్తుల రద్దీ పెరగడంతో ఉచిత స్పర్శదర్శనాన్ని అమలు చేయడం లేదు. భక్తుల నుంచి ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ విషయంపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనలతో ఉచిత స్పర్శదర్శనంపై తదుపరి చర్యలు తీసుకుంటాం.– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

న్యూస్రీల్

మహానందీశ్వరుడి సేవలో కలెక్టర్



కలెక్టర్ దంపతులను సత్కరిస్తున్న పండితులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా దంపతులు పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చిన కలెక్టర్ దంపతులకు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం స్వామి వారి అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు కలెక్టర్ రాజకుమారి దంపతులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

పీజీఆర్ఎస్లో 110 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్సింగ్రాణా

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ అధిరాజ్సింగ్రాణా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 110 ఫిర్యాదులు అందాయి. అర్జీదారుల నుంచి వినతులు అందుకున్న అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. చట్టపరమైన ఫిర్యాదులపై వెంటనే విచారించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్లో తమకు అందిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా స్టేషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు రాలేని వారు సమీపంలోని స్టేషన్ అధికారులకు వినతులు సమర్పించవచ్చని ఎస్పీ సూచించారు.

ఎంపీడీఓలకు మండలాలు కేటాయింపు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి జిల్లాలో ఎంపీడీఓలుగా పదోన్నతులు పొందిన పరిపాలనాధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలకు మండలాలు కేటాయించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయా మండలాలకు నియమితులైన ఎంపీడీఓలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ బీవీ రమణారావును దేవనకొండ, బీ నూర్జహాన్ను మంత్రాలయం, కె.విజయశేఖర్రావును కౌతాళం, జి.ప్రభావతిదేవిని పెద్దకడుబూరు, ఎ.మద్దిలేటి స్వామిని ఆలూరుకు నియమించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షలకు 392 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలకు 392 మంది గైర్హాజరయ్యారు. 3,384 మందికి 2,992 మంది ఛాత్రోపాధ్యాయులు హాజరు కాగా 392 మంది గైర్హాజరయ్యారని, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా వారిని డిబార్ చేసినట్లు తెలిపారు.

డీసీసీబీ, డీసీఎంఎస్లకు చైర్మన్లు

- డీసీసీబీ చైర్మన్గా ఎదురూరు విష్ణువర్ధన్రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్గా నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలకు చైర్మన్లను ప్రకటించింది. సహకార సంఘాలు, డీసీసీబీ, డీసీఎంఎస్లకు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడానికి ఇష్టపడటం లేదని తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇదిలాఉంటే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్గా కోడుమూరు నియోజకవర్గం ఎదురూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత డి.విష్ణువర్ధన్రెడ్డి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్గా డోన్ నియోజకవర్గం చంద్రపల్లి గ్రామానికి చెందిన జి.నాగేశ్వరరావు పేర్లను ప్రకటించారు. అయితే జీవోలు విడుదల కావాల్సి ఉంది.

క్లుప్తంగా

ఏపీ టీఏఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్



రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ధ్రువపత్రాన్ని అందుకుంటున్న పలనాటి సునీల్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్(ఏపీ టీఏఎస్ఏ) నూతన కార్యవర్గం ఎన్నికలు సోమవారం విజయవాడలో జరిగాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కర్నూలు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీఓగా పనిచేస్తున్న పలనాటి సునీల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి ఈయన అసోసియేషన్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లుగా ఎన్నికల అధికారి పి.కిరణ్‌కుమార్ ధ్రువపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో తనకు ప్రాతినిధ్యం కల్పించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరాల్సిన విద్యార్థులు మే 24వ తేదీలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, 26వ తేదీలోపు నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని, జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు డోన్ ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9866022451 నంబరును సంప్రదించాలన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌లపై నిఘా పెంచుతాం



మాట్లాడుతున్న స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచుతామని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యాన్ని అక్రమ రాష్ట్రాంలోకి రాకుండా నిఘా ఉంచామన్నారు. మద్యం దుకాణాల పక్కన అనుమతులు లేకుండా షెడ్లు ఏర్పాటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కర్ణాటక మద్యంతో పాటు బెల్టుషాపులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సరిహద్దు చెక్‌పోస్ట్‌లను పరిశీలించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ శాచేరు. సోమవారం ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి శివయ్య, ఉపాధ్యక్షుడు జాకీర్‌హుసేన్‌లతో కలిసి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. 8 ఏళ్లు పూర్తయిన ఎస్‌జీటీలు 1,500పైగా ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి వస్తోందన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు వీరేశ్వరరెడ్డి, పుల్లయ్య, రాజేష్, మల్లికార్జున, మధు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ జాతరకు వేళాయె!

- యాళ్లూరులో 11 ఏళ్ల తర్వాత ఉత్సవం
- గ్రామంలో పండగ సందడి

గోస్పాడు: కుల, మత, రాజకీయాలకు అతీతంగా యాళ్లూరులో పెద్దమ్మ జాతరను నిర్వహించేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. 1926, 1966, 2015 సంవత్సరాల్లో గ్రామంలో జాతరను నిర్వహించారు. మళ్లీ పదకొండేళ్ల తర్వాత ఈనెల 29, 30 తేదీల్లో జాతర నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. అమ్మవారికి ప్రత్యేకంగా ఎలాంటి ఆలయం లేకపోవడంతో పూర్వం నుంచి వస్తున్న ఆచారం మేరకు అమ్మవారిని స్థానిక రామచావిడి ఎదుట ఏర్పాటు చేసి జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటితో ఉత్సవాలు ప్రారంభం

పెద్దమ్మ జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అమ్మ వారి మహిషముల గ్రామ ఊరేగింపు ఉంటుంది. రాత్రి 8గంటలకు అన్నదానం, 10 గంటలకు అమ్మవారిని రామ చావిడికి తీసుకెళ్లి ఆశీనులను చేయనున్నారు. 30 తెల్లవారుజామున 3.30 గంటలకు అమ్మవారికి మహిషముల సమర్పణ, ఉదయం 5 గంటల నుంచి గ్రామంలో పొలి చల్లే కార్యక్రమం, ఉదయం బోనాల సమర్పణ, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు అన్నదానం, సాయంత్రం 4గంటల నుంచి అమ్మవారికి గ్రామోత్సవం(దీవెన బండారు) నిర్వహిస్తారు.



పెద్దమ్మ జాతరను నిర్వహించే ప్రదేశం ఇదే

జాతరకు అధిక ఖర్చు..

అమ్మవారికి మొక్కు తీర్చుకునే విషయంలో గ్రామస్తులు ఖర్చుకు వెనుకాడటం లేదు. జాతరకు వచ్చే బంధుమిత్రులకు మాంసాహార విందు ఇచ్చేందుకు బాగానే ఖర్చు అవుతుంది. ఈలెక్కన గ్రామం మొత్తంపై దాదాపు రూ. 4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఖర్చు కావచ్చని గ్రామ పెద్దలు అంచనా వేస్తున్నారు.



యాళ్లూరు గ్రామ చావిడి

ప్రశాంతంగా నిర్వహించాలి

జాతర ప్రశాంతంగా జరుపు కోవాలి. ఎలాంటి గొడవలకు తావులేకుండా జాతర పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలి. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవు. జాతర సందర్భంగా వాహనాలకు, ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా గ్రామ శివారులు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంతో వాహనాలు నిలుపుకోవాలి. – ఎస్ఐ వెంకటప్రసాద్

కలపరిలో జ్వరంతో వృద్ధురాలి మృతి

- కొనసాగుతున్న వైద్య శిబిరం
- గ్రామాన్ని సందర్శించిన అధికారులు



మృతి చెందిన వెంకమ్మ (ఫైల్)

ఆస్పరి: జ్వరాలతో మంచం పట్టిన కలపరిలో ఓ వృద్ధురాలు మృతి చెందడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల క్రితం గ్రామంలో జ్వరపీడితుల రక్త నమూనాలు ల్యాబ్‌కు పంపగా చికున్ గున్యాగా బయటపడింది. 26 మందిని పరీక్షించగా 10 మందికి చికున్ గున్యా ఉన్నట్లు తేలింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన వెంకమ్మ (60) జ్వరంతో బాధపడుతూ ఆదివారం రాత్రి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులు క్రితం వెంకమ్మకు జ్వరంతో పాటు కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతండడంతో మొదట ఆర్ఎంపీతో వైద్యం చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో ఆమెను ఐదు రోజుల క్రితం కర్నూలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడ రూ. 3 లక్షలు ఖర్చు అయినా జ్వరం నయం కాకపోవడంతో కుటుంబీకులు రెండు రోజులు క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా కోలుకోలేక ఆదివారం రాత్రి 11 గంటలకు మృతి చెందినట్లు వెంకమ్మ కుమారుడు గిడ్డయ్య తెలిపారు. వెంకమ్మకు భర్త వెంకటేష్, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

కలపరి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం సోమవారం కూడా కొనసాగింది.



వైద్య శిబిరంలో జ్వర పీడితుల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

వైద్య శిబిరాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప సదందర్శించి రోగులతో మాట్లాడారు. రక్త పరీక్షల ద్వారా చికెన్ గున్యా వ్యాధిగా నిర్ధారణ కావడంతో గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చికెన్ గున్యా సోకిన వారికి తలనొప్పి, వాంతులు, జ్వరం, వికారం, చేతి వేళ్లు, కాళ్లు నుంచి మొదలుకుని శరీరంలోని అన్ని కీళ్లు నొప్పితో బాధిస్తుందన్నారు. కీళ్ల నొప్పులు వల్ల సరిగా నిలబడలేని పరిస్థితి వస్తుందని, జ్వరం తగ్గినా నొప్పులు ఎక్కువ కాలం ఉంటాయన్నారు. రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో జ్వరాలు తగ్గే వరకు వైద్య శిబిరం కొనసాగిస్తామని పత్తికొండ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘు రామిరెడ్డి చెప్పారు. సోమవారం వైద్య శిబిరంలో 30 మందికి వైద్య చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశామని, అవసరమైన వారికి వైద్యం అందించాని డాక్టర దుర్గాబాయి తెలిపారు. వైద్య శిబిరంలో సర్పంచ్ సుధమ్మ, పంచాయతీ, వైద్య సిబ్బంది వెంకటేష్, విజయరాజు, పద్మావతి, శంకర్, ఖలీల్, శకుంతల రోగులకు సేవలు అందించారు.

దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కోట్ల హర్ష



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో ఈనెల 26న జరిగిన దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నడిపి రంగన్న (38) ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. దీంతో పులకుర్తిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నడిపి రంగన్న అదే గ్రామానికి చెందిన మునిస్వామిల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 26న నిందితుడు మునిస్వామి, బజారి, మరి కొద్ది మంది అనుచరులతో కలిసి నడిపి రంగన్నను, అతని అల్లుడు సురేష్ విషయంపై మాట్లాడేందుకంటూ పిలిపించారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నడిపి రంగన్నతో గొడవ పెట్టుకుని రాడ్లు, కర్రలతో తీవ్రంగా కొట్టారు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆదివారం సాయంత్రం ఇంటికి తీసుకెళ్లారు. అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురై స్పృహలేకుండా పడిపోవడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే రంగన్న మృతిచెందినట్లు చెప్పారు. మునిస్వామి అతని అనుచరులు కొట్టిన దెబ్బల వల్లే రంగన్న మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మృతుడికి భార్య మల్లీశ్వరీ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని రంగన్న మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నడిపి రంగన్న మృతికి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు రవికుమార్‌రెడ్డి, లింగమూర్తి, జగదీష్ ఉన్నారు.



దాడిలో గాయపడి మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నడిపి రంగన్న

యాగంటిని దర్శించుకున్న డైరెక్టర్ సుకుమార్



స్వామి వారి ప్రసాదం స్వీకరిస్తున్న డైరెక్టర్ సుకుమార్

బనగానపల్లె రూరల్: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటిలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామిని ప్రముఖ సినీ డైరెక్టర్ సుకుమార్ సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వరస్వామి గుహను సందర్శించి అక్కడున్న వెంకటేశ్వరస్వామిని కూడా దర్శించుకున్నారు. గతంలో అల్లుఅర్జున్ హీరోగా నటించిన పుష్ప-2 షూటింగ్ ఇక్కడ జరిగిన విషయం తెలిసిందే. మళ్లీ డైరెక్టర్ సుకుమార్ యాగంటిని దర్శించుకోవడంతో పుష్ప-3 షూటింగ్ చిత్రీకరణ ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం వచ్చి ఉంటారనే చర్చ అభిమానుల మధ్య సాగుతోంది.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి

రుద్రవరం: మండల కేంద్రంలోని బెస్త కాలనీలో సోమవారం విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ జనార్దన్(42) మృతి చెందాడు. కాలనీ వాసులు తెలిపిన వివరాలు.. జనార్దన్ కొన్నేళ్లుగా కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అప్పుడప్పుడు విద్యుత్ స్తంభాలకున్న డిష్ తీగలను సరిచేస్తూ ఉండటాన్ని అదిగమనించిన విద్యుత్ లైన్‌మెన్ ఖాజామొహిద్దీన్.. బెస్త కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలు సరి చేయాలని కోరాడు. లైన్‌మెన్ నిచ్చెన పట్టుకోగా కేబుల్ ఆపరేటర్ స్తంభంపైకి చేరుకొని విద్యుత్ తీగలను సరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సలు అందిస్తుండగానే మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు. ఎస్ఐ వరప్రసాదు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు.



మృతి చెందిన కేబుల్ ఆపరేటర్

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- 30న ప్రవేశ పరీక్ష
- జిల్లాకు 22 పరీక్ష కేంద్రాలు కేటాయింపు
- హాజరుకానున్న 5,700 మంది అభ్యర్థులు

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30న పాలిసెట్-2025 నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పరీక్షకు గంట ముందుగానే ఆయా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. జిల్లా వ్యాప్తంగా పాలిసెట్‌కు 5,700 మంది దరఖాస్తు చేసుకున్నారు. నంద్యాలలో 13 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఇందులో 3,747 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

జిల్లాలో 5 కళాశాలలు

ప్రభుత్వ పాలిటెక్నిక్ పాటు జిల్లావ్యాప్తంగా 2 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిల్లో కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సివిల్ 66, మెకానికల్ 132 సీట్లు ఉండగా, ఐదు ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సుమారు 1,500 సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంత మంది హాజరవుతారో, వారిలో ర్యాంకులు సాధించేవారెందరో, ర్యాంకు వచ్చినా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ఎంత మంది ఆసక్తి చూపుతారో చూడాల్సి ఉంది. కొన్నేళ్లుగా కొన్ని కళాశాలల్లో వందల సంఖ్యలో సీట్లు ఉండగా, పదుల సంఖ్యలోనే విద్యార్థులు చేరుతూండటంతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారుతున్నట్లు సమాచారం.



నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

గంట ముందుగానే ప్రవేశం

- ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు.
- పరీక్ష కేంద్రంలోకి ఉదయం 10 గంటల నుంచి అనుమతిస్తారు.
- పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోనికి అనుమతించరు.
- విద్యార్థులు హాల్ టికెట్టు, బాల్ పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ తీసుకుని వెళ్లాలి.
- సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల ఆవరణంలో తాగునీరు, విద్యుత్, వైద్య సేవల వంటి మౌలిక వసతులకు కల్పనకు ప్రాధాన్యమిచ్చాం.
– శ్రీనివాసప్రసాద్, జిల్లా కో ఆర్డినేటర్, నంద్యాల

కాంగ్రెస్ నేత హత్యోదంతంలో నలుగురిపై కేసు

- భారీ బందోబస్తు మధ్య లక్ష్మీనారాయణ అంత్యక్రియలు

ఆలూరు/ఆలూరు రూరల్/చిప్పగిరి: కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ హత్యోదంతంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవిశంకర్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం చిప్పగిరి-గంతకల్లు మధ్య దుండగులు లక్ష్మీనారాయణ ప్రయాణిస్తున్న ఇన్నోవా కారును లారీతో గుద్ది వేటకొడవళ్లతో దారుణంగా నరికి హత్య చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, మల్లేష్, కొండ రామాంజితో పాటు మరికొందరిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. 2006లో టీడీపీ నేత, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు దంపతుల హత్యకేసులో లక్ష్మీనారాయణ 7వ ముద్దాయి కాగా.. ఈ కేసును 2019లో కోర్టు కొట్టివేసింది. ఇదిలాఉంటే కర్నూలు-అనంతపురం జిల్లాల్లో సరిహద్దులో జరిగిన లక్ష్మీనారాయణ హత్య కేసును అనంతపురం జిల్లా గుంతకల్లు పోలీసు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా.. కర్నూలు జిల్లా చిప్పగిరి పోలీసు స్టేషన్‌కు బదలాయించారు. లక్ష్మీనారాయణ మృతదేహానికి సోమవారం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆయన భౌతికాయాన్ని భారీ పోలీసు బందోబస్తు నడుమ స్వగ్రామమైన చిప్పగిరికి తరలించారు.



లక్ష్మీనారాయణ భౌతికాయానికి నివాళులు అర్పిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఉద్దేశపూర్వకంగానే పికెట్ తొలగింపు: మారెప్ప

లక్ష్మీనారాయణ హత్యోదంతంపై సీబీఐతో విచారణ జరిపించాలని మాజీ మంత్రి మూలింటి మారెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చిప్పగిరిలో లక్ష్మీనారాయణ భౌతికాయానికి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన పది నెలల్లో కుల రాజకీయాలకు వత్తాసు పలుకుతూ హత్యా రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే లక్ష్మీనారాయణ ఇంటి వద్ద పికెట్‌ను తీసివేశారన్నారు. పికెట్ కొనసాగించాలని హోంమంత్రి అనితకు స్వయంగా తాను విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు తదితరులు ఉన్నారు.

లక్ష్మీనారాయణ అంత్యక్రియలు పూర్తి

చిప్పగిరి: గుంతకల్లు – చిప్పగిరి మధ్య ఆదివారం హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం చిప్పగిరిలో సోమవారం పూర్తయ్యాయి. మృతదేహానికి ఎమ్మెల్యే విరుపాక్షి నివాళులు అర్పించగా.. పీసీ అధ్యక్షురాలు షర్మిళ ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంత్యక్రియల సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏఎస్పీ ఉసేన్ పీరా ఆధ్వర్యంలో 8 మంది సీఐలు, పలువురు ఎస్ఐలతో గట్టి బందోబస్తు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గ్రామాన్ని, హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కాగా నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు, ఎమ్మార్పీఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుళ్లిన మామిడి పండ్ల విక్రయం

- సోదాలు చేసి పారబోసిన అధికారులు

కర్నూలు (హాస్పిటల్): గాలి వానలకు రాలిపడిన పండ్లను సేకరించి వాటిని కాల్షియం కార్బైడ్‌తో మాగించారు. ఈ ప్రక్రియలో ఆ పండ్లు కుళ్లిపోయాయి. అయినా వాటిని అలాగే వినియోగదారులకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు రావడంతో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరమణ కాలనీ చివర్లో ఫ్లై ఓవర్ వద్ద ఉన్న పండ్ల దుకాణంలో సోదాలు నిర్వహించారు. కుళ్లిన మామిడి పండ్లను గుర్తించి ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్రకు సమాచారం అందించి చెత్తబండి తెప్పించారు. కన్స్యూమర్ సెక్రటరీ ఎ.శివమోహన్‌రెడ్డి సమక్షంలో కుళ్లిన పండ్లను పారబోయించారు.

వ్యాపారులకు రూ.1.25 లక్షల జరిమానా

ఆహార భద్రత నియమాలు పాటించని వ్యాపారులపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు కొరఢా ఝుళిపించారు. ఇటీవల దాడులు నిర్వహించిన పలు కేసుల్లో నిబంధనలు పాటించని వ్యాపారులకు రూ.1.25 లక్షల జరిమానా విధించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్ తెలిపారు. చైతన్య జూనియర్ కాలేజీ క్యాంపస్‌లోని అంజని జయకృష్ణకు రూ.10 వేలు, ఎమ్మిగనూరులోని సాయి కేక్ ప్యాలెస్‌కు రూ.10 వేలు, కర్నూలులోని ఆరా ఫుడ్స్ అండ్ బేవరేజెస్‌కు రూ.10 వేలు, హాలహర్వి పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్తీ నెయ్యి విక్రయిస్తున్న వ్యాపారుడికి రూ.5 వేలు, బ్లూ మూన్ సూపర్ మార్కెట్‌లో నాసిరకం బెల్లం విక్రయిస్తున్న వారికి రూ.25 వేలు, శ్రీకృష్ణ ట్రేడర్స్‌లో నాసిరకం దనియాల పొడి విక్రయిస్తున్న వారికి రూ.10 వేలు, వెలుర్తిలోని శేగు కిరాణం వారికి రూ.20 వేలు, ఎమ్మిగనూరులోని ఎస్ఏఎఫ్ ఫ్లవర్స్ వారికి రూ.15 వేలు, ఆదోనిలోని అయ్యంగార్ కన్ఫెక్షనరీస్‌కు రూ.20 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.



కుళ్లిన మామిడి పండ్లను చెత్తబండిలో పారబోయిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్

హామీల అమలుపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన మేనిఫెస్టో హామీల అమలుపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి విమర్శించారు. సోమవారం సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే సీపీఎస్/జీపీఎస్ విధానాన్ని సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని, మెరుగైన పీఆర్‌సీ అమలు చేస్తామని, తాము అధికారాన్ని చేపట్టిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేస్తామని అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఆ దిశగా ఆలోచనలు చేయకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. జీఓ 117 రద్దు చేసి కొత్త పాఠశాలల విధానాన్ని అమలు చేసేటప్పుడు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి, కార్యదర్శి టి.కె జనార్దన్, నాయకులు వీరచంద్ర యాదవ్, సి.రమేష్, షఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.రఘునాథ రెడ్డి

బంగారు కిరీటం సమర్పణ

ఆదోని అర్బన్: మహాయోగి లక్ష్మమ్మవ్వకు సోమవారం ఆలయ నిర్వాహకులు బంగారు కిరీటం సమర్పించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రాయచోటి సుబ్బయ్య, సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ నిర్వాహకులు రాయచోటి సుబ్బయ్యకు బంగారు కిరీటం అందజేస్తున్న చంద్రశేఖర్ ఆజాద్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీఏ వలి అధ్యక్షతన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెండు రోజుల పాటు జరిగే దీక్షలను మొదటి రోజు సోమవారం సంఘం రీజినల్ చైర్మన్ ఎస్ఎండీ గౌస్, కార్యదర్శి సి.మద్దిలేటిలు దీక్షలో కూర్చున ఉద్యోగులకు పూల మాలలు వేసి ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని డిపోల ఎదుట దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం జారీ చేసిన సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్స్, రిమూవల్స్‌ను నిలిపి వేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మొదటి రోజు దీక్షలో ఆర్‌బీఎస్ మూర్తి, కేటీ రెడ్డి, సి.లక్ష్మన్న, ఆర్‌పీ రావు, జేబీ రాజేశ్వరయ్య, ఎం.జెడ్ బాషా, ఎస్‌డీ బాషా కూర్చున్నారు. వీరికి డిపో-1 సెక్రటరీ సయ్యద్ ఇసాక్, డిపో-2 సెక్రటరీ ఎంఎస్‌బీ రెడ్డి సంఘీభావం తెలిపారు.

మనస్సున్న కృష్ణయ్య



మండు వేసవిలో పక్షుల నీటి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నోరు లేని ఆ ప్రాణులకు దబ్బ్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన కృష్ణయ్య దాహం తీర్చుతూ పలువురి మన్ననలు పొందుతున్నాడు. గ్రామ శివారులోని పెద్దమ్మ సెంటర్ వద్ద ఓ చెట్టుకింద చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహం తీర్చే అతడు పక్షుల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. రెండు బాటిళ్లను ఓపైపు కత్తిరించి స్టాండ్‌కు ఏర్పాటు చేసి అందులో నీళ్లు పోస్తున్నాడు. అక్కడే మరో రెండు తొట్లను చేయించి వాటిలో నీరు ఉంచుతుండటంతో పక్షులు దాహం తీర్చుకుంటున్నాయి. మరోపక్క చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రతి ఆది, మంగళవారాల్లో మజ్జిన పోస్తూ పుణ్యం మూట కట్టుకుంటున్నాడని అక్కడికి వచ్చే వాళ్లు క్రిష్ణయ్యను అభినందిస్తున్నారు.
– దొర్నిపాడు